సాక్షి
హనుమకొండ
సోమవారం । 11 । సెప్టెంబర్ । 2023



అతిపెద్ద గానుగరాయి

రఘునాథపల్లి మండలం కుర్చపల్లిలో అతిపెద్ద గానుగరాయిని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి వెలుగులోకి తెచ్చారు. - 8లో▸



పంటలకు సస్య'రక్షణ'

కూరగాయల పంటలు, ఉద్యాన తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై ఉద్యాన శాఖ అధికారి రమేశ్ పలు సూచనలు చేశారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $31^0/26^0$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందుండాలి

● రాష్ట్ర కార్యదర్శి వంగేటి అశోక్‌కుమార్



కమలాపూర్: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందుండాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి వంగేటి అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం కమలాపూర్ మండలంలోని 200 కుటుంబాలతో శ్రావణమాస వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఆటపాటలు, దాండియా నృత్యాలతో ఉల్లాసంగా గడిపారు. ముఖ్య అతిథిగా హాజరైన అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు తాటిపెల్లి రాజన్న, ఆర్యవైశ్య మహాసభ మండల, పట్టణ బాధ్యులు భూపతి రాజు, కొనిశెట్టి మునీందర్, సుద్దాల కార్తీక్, వెనిశెట్టి పున్నంచందర్, వెనిశెట్టి శివకుమార్, నంగునూరి సాగర్ బాబు, గోదావరిఖని అధ్యక్షుడు వెనిశెట్టి నటరాజ్, మాజీ సర్పంచ్ అయిత మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో ఈనెల 12 నుంచి నిర్వహించాల్సిన బీపీఈడీ, ఎంపీఈడీ పరీక్షలు, ఈనెల 13 నుంచి జరగాల్సిన ఐదేళ్ల లా, మూడేళ్ల లా పరీక్షలను నిరవధికంగా వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి ఆదివారం తెలిపారు. మళ్లీ ఆయా పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామన్నారు.

నేడు గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరపాలక సంస్థలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, రాత పూర్వకంగా అందజేసిన ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించడానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

● అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు



హన్మకొండ: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, అధికారులు చొరవ చూపాలని టీఎన్జీఓస్ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు రావు సరస్వతి కోరారు. ఓ సంఘం అంగన్‌వాడీల ఆందోళనకు పిలుపునిచ్చిన క్రమంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలను గుర్తించిన సీఎం కేసీఆర్ టీచర్లు, హెల్పర్లకు తగిన హోదా కల్పించి ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని అన్నారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు పౌష్టికాహారం అందిస్తున్నారని చెప్పారు. అయితే.. ఈ వ్యవస్థతో సంబంధం లేని కొంత మంది అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్లను, హెల్పర్లను మభ్యపెట్టి సమ్మె బాట పట్టిస్తున్నారని, వీరి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. తాము సమ్మెకు వెళ్లడం లేదని సేవలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

రూ.5వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



దామెర: 5వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మడలంలోని దుర్గంపేట్ సమీప ఎస్ఎస్ఆర్ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిరుపేద రెడ్ల అభివృద్ధి, సంక్షేమానికి చట్టబద్ధతతో కూడిన కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా సత్వరమే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈనెల 12న దామెర సమీప ఏఎస్ఆర్ గార్డెన్స్‌లో తలపెట్టిన మండల విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి, నాయకులు వీసం రమణారెడ్డి, మన్నెం ఇంద్రారెడ్డి, గొంది జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన నగరం

శ్రావణ మాసం.. చివరి ఆదివారం నగరంలో బోనాల జాతర జరిగింది. పోచమ్మ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య మహిళలు బోనాలతో దేవాలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. - హన్మకొండ



హనుమకొండ గోకుల్‌నగర్ పోచమ్మ దేవాలయంలో..



పోతరాజుల విన్యాసాలు





హనుమకొండ పోచమ్మకుంట ఆలయంలో..

పోషణ.. అవగాహన

● అంగన్వాడీ కేంద్రాల్లో ఈనెలాఖరు వరకు నిర్వహణ
● చిన్నారులు, గర్భిణులకు మేలు
● కొనసాగుతున్న వివిధ కార్యక్రమాలు



పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అవగాహన ర్యాలీలో అంగన్‌వాడీలు, తదితరులు

కాజీపేట అర్బన్: మహిళలు, చిన్నారుల్లో పోషకలోపాలు, రక్తహీనతను తగ్గించేందుకు, అంగన్వాడీ కేంద్రాల్లో సెప్టెంబర్ నెలను పోషణ మాసంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఈనెల ఒకటో తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమం 30 వరకు కొనసాగనుంది. ఇందులో నీటి పొదుపు, పెరటి మొక్కల పెంపకం, అంగన్వాడీ కేంద్రాల్లో తయారు చేసిన బొమ్మల ప్రదర్శన, పోషకాహార విలువలు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ వర్కర్లు గృహ సందర్శనపై అవగాహన కల్పిస్తున్నారు. హనుమకొండ జిల్లా పరిధి హనుమకొండ, భీమదేవరపల్లి, పరకాల ప్రాజెక్టుల్లో 757 మెయిన్, 31 మినీ అంగన్వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 28,098 మంది చిన్నారులు, 8,375 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

నెలరోజుల కార్యక్రమాలు ఇలా..

పోషణ మాసంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తారు. గర్భం దాల్చిన రోజు నుంచి బిడ్డ పుట్టిన రెండేళ్ల వరకు వెయ్యి రోజుల పాటు పోషకాహారం తీసుకోవడం, రక్తహీనత సమస్య, తల్లిపాల ప్రాముఖ్యత, పిల్లల బరువు, ఎదుగుదలను పరిశీలించి పరీక్షలు నిర్వహిస్తారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు పోషణ మేళాలు, సామూహిక సీమంతాలు, అన్నప్రాసన, పోషణ సభలు, ర్యాలీలు, పాఠశాలల్లో ఎనీమియా పరీక్షలు చేపడతారు.



చిన్నారి ఎదుగుదలను పరిశీలిస్తున్న అంగన్వాడీ సిబ్బంది

అవగాహన కల్పించడానికి ర్యాలీలు



పోషణ మాసంలో అవగాహన కోసం ర్యాలీలు నిర్వహిస్తున్నాం. గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యానికి, రక్తహీనతను తగ్గించేందుకు కోడిగుడ్లు, పాలు, పోషకాహార భోజనం అందిస్తున్నాం. చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి, ఎదుగుదలకు బాలామృతం పంపిణీ చేస్తున్నాం.

- మధురిమ, ఇన్‌చార్జ్ జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి

ఐలమ్మ స్ఫూర్తితో స్వప్నం సాకారం



కాజీపేట అర్బన్: నివాళులర్పిస్తున్న చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్



ఖిలా వరంగల్: ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మేయర్ సుధారాణి

● చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

కాజీపేట అర్బన్: చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. 31వ డివిజన్ న్యూశాయంపేటలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చీఫ్‌విప్ మాట్లాడుతూ.. ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మేయర్ సుధారాణి, అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ, బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి, కార్పొరేటర్ మామిండ్ల రాజు, రజక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యోధురాలు చాకలి ఐలమ్మ : అడిషనల్ కలెక్టర్, మేయర్ సుధారాణి

ఖిలా వరంగల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని వరంగల్ అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణి అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆదివారం వరంగల్ కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 38వ వర్ధంతి నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అడిషనల్ కలెక్టర్, బీసీ సంక్షేమాధికారి పుష్పలత, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి సంజీవరెడ్డి, రజక సంఘం అధ్యక్షుడు గుడెల్లి రామచంద్రు, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు మధు చందర్‌తో కలిసి మేయర్ సుధారాణి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వీసీ, రిజిస్ట్రార్‌ను బర్తరఫ్ చేయాలి

● కేయూ జేఏసీ బాధ్యులు
● నిరసనకు మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ సంఘీభావం
● దీక్ష విరమింపజేసిన రావు పద్మ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు

కేయూ క్యాంపస్: పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని ప్రశ్నించిన విద్యార్థులపై కేసులు పెట్టించి పోలీసులచే దాడి చేయించిన వీసీ, రిజిస్ట్రార్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలని కేయూ జేఏసీ బాధ్యులు డిమాండ్ చేశారు. వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం క్యాంపస్‌లోని దూర విద్యా కేంద్రం ఆవరణలో నిరసన దీక్షలు కొనసాగించారు. విద్యార్థి సంఘం నాయకులపై దాడి చేసిన పోలీసు అధికారులను ఉద్యోగాల నుంచి తొలగించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ తెలంగాణ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, మాజీ ఎంపీ, కాంగ్రెస్‌పార్టీ నాయకులు సిరిసిల్ల రాజయ్య, బీజేపీ రాష్ట్ర నాయకులు వన్నాల వెంకటరమణ విద్యార్థులను పరామర్శించారు. బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన అనంతరం నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. దీక్షలో.. గాయపడ్డ విద్యార్థులు మాచర్ల రాంబాబు, ఆరెగంటి నాగరాజు, అంకిళ్ల శంకర్, విద్యార్థి సంఘాల జేఏసీ బాధ్యులు డాక్టర్ మంద వీరస్వామి, డాక్టర్ బుర్రి ఉమాశంకర్, కుర్మా అధ్యక్షుడు తాళ్లపెల్లి నరేశ్‌గౌడ్, ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ మంద భాస్కర్, విద్యార్థి సంఘాల నాయకులు మేడ రంజిత్‌కుమార్, నిమ్మల రాజేశ్, నర్సింహారావు, గుగులోతు రాజు, కాశీ, పాషా, వడ్డేపల్లి మధు, కేతపాక ప్రసాద్, అభిరామ్, కందికొండ తిరుపతి, మల్లేశ్‌గౌడ్, హర్షవర్ధన్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరున్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

ధర్మసాగర్: మండలంలోని క్యాతంపల్లి శివారు నవనాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, వరంగల్ క్రైమ్ డీసీపీ మురళీధర్, సీసీఎస్ రమేశ్ ఆదివారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా భద్రకాళి దేవస్థానం ప్రధానార్చకులు ఆగమ సామ్రాట్ శ్రీ భద్రకాళి శేషు ఆధ్వర్యంలో నిర్వహించిన నవనాగ యజన పురస్సర నక్షత్రారామ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. నృత్య రవళి కళాక్షేత్ర ముత్యాల పరమేశ్వర్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గంటా పవన్ శర్మ, బీఆర్ఎస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి సన్నిధిలో ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

ఉప్పల్‌కు 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డు

● మంత్రి ఎర్రబెల్లి చేతుల మీదుగా అందుకున్న సర్పంచ్ దేవేందర్‌రావు



మంత్రి దయాకర్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ దేవేందర్‌రావు

కమలాపూర్: కమలాపూర్ మండలం ఉప్పల్ జిల్లా స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డు–2023 ఎంపికైంది. అలాగే రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్‌రావు, పంచాయతీ కార్యదర్శి బైరి శ్రీనివాస్‌లను జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కలెక్టర్ సిక్తా పట్నాయక్.. సత్కరించి ప్రశంసపత్రం, అవార్డు అందజేశారు. గ్రామంలో వందశాతం తడి, పొడిచెత్త బుట్టల పంపిణీ, వందశాతం పన్నుల వసూలు, సక్రమంగా విద్యుత్ బిల్లుల చెల్లింపులు, సిబ్బందికి సకాలంలో వేతనాలు అందించడం, పల్లె ప్రకృతి వనం, నర్సరీ, తెలంగాణ క్రీడా ప్రాంగణం, వైకుంఠధామం నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చినందుకు ఈఅవార్డుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్, ఎంపీ దయాకర్, ఎంపీడీఓ పల్లవి, ఏపీఓ రమేశ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో తెలంగాణ

కాజీపేట: పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం అధికారుల సహకారంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఆదివారం పంచాయతీ కార్యదర్శి గ్రేడ్–4 నియామక ఉత్తర్వులు పంపిణీ చేశారు. హనుమకొండలో 74 మంది కార్యదర్శులు, వరంగల్ జిల్లాలో 128 మందిని శాశ్వత ఉద్యోగులుగా నియమించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రానున్న పండుగలను దృష్టిలో పెట్టుకుని పారిశుద్ధ్య పనులు చక్కగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, ఎంపీ పసునూరి దయాకర్, జెడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో పాటు ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరకాలం నిలిచేవి బోధనా పుస్తకాలు

● విశ్రాంత ఆచార్యులు శ్రీపెరంబుదూరు శ్రీరంగాచార్య
● ఘనంగా దహగం సాంబమూర్తి పుస్తకాల ఆవిష్కరణ



భారతీయ చింతన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీపెరంబుదూరు శ్రీరంగాచార్య తదితరులు

హన్మకొండ కల్చరల్: ప్రముఖ పాఠ్యబోధనా పుస్తకాల రచయిత దహగం సాంబమూర్తి రాసిన పాఠ్యబోధనా పుస్తకాలు విద్యావ్యవస్థలో చిరకాలం నిలుస్తాయని విశ్రాంత చార్యులు శ్రీపెరంబుదూరు శ్రీరంగాచార్య అన్నారు. ఆదివారం హనుమకొండ వడ్డేపల్లిలోని సీఆర్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త, పాఠ్యబోధనా రచయిత, డైట్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ దహగం సాంబ మూర్తి 80 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్సవాన్ని, పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజామనోహర బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీరంగాచార్య ముఖ్యఅతిథిగా పా ల్గొని సాంబమూర్తి అభినందన సంచిక భారతీయ చింతన ఆధ్యాత్మిక వ్యాసగుచ్ఛం, మహితోక్తులు, అక్షర శిల్పాలు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మల్ల ప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి సాంబమూర్తి రచనలను పరిచయం చేశారు. డాక్టర్ ఎస్వీఎస్ చారి, కుందావజ్ఝల కృష్ణమూర్తి సంయోజకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కంది శంకరయ్య, ఎన్సీహెచ్ చక్రవర్తి, మలినేని కృష్ణ, నాల్యకొండ భాస్కర్‌రావు, వరిగొండ కాంతారావు, వజ్ఝల రంగాచార్య, డాక్టర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్లాట్లు.. పాట్లు!

దోమలు, ఈగలకు ఆవాసాలుగా ఖాళీ స్థలాలు

● ఇబ్బందులు పడుతున్న కాలనీల వాసులు
● పట్టించుకోని బల్దియా అధికారులు
● యజమానులకు నోటీసులందించడంలో నిర్లక్ష్యం

కాజీపేట: 'స్థలాలు కొని ఏళ్లుగా ఖాళీగా ఉంచితే నోటీసులిస్తాం. స్పందించకపోతే స్వాధీనం చేసుకుని బోర్డులు పెడతాం' అంటూ అధికారులు ఊదరగొట్టారు. ఆతర్వాత మర్చిపోయారు. ఫలితంగా భూదందాలు పెరుగుతున్నాయి. ఖాళీ స్థలాల్లో చెట్లు పెరిగి దోమలు, పురుగులు చేరుతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాజీపేట పట్టణ పరిధి ప్రశాంత్‌నగర్, ప్రగతినగర్, బ్యాంక్‌కాలనీ, రాంనగర్, సోమిడి, దర్గాకాజీపేట తదితర ప్రాంతాల్లో దాదాపు 20 ఏళ్ల క్రితమే స్థలాల్ని కొందరు కొన్నారు. అప్పట్లో భూములకు ధరలు లేక తక్కువ ధరకు కొని ఖాళీగానే వదిలేశారు. చాలా మంది ఆయా స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. కొంత మంది వేరే ఊళ్లలో ఉంటున్నారు.

కబ్జాదారులకు వరం!

చాలామంది ప్లాట్ల యజమానులు కనీసం హద్దులు కూడా ఏర్పాటు చేసుకోలేదు. ఫెన్సింగ్ వేయనివారు అనేకం. ఇదే అక్రమార్కులకు వరంగా మారింది. కాగితాలు ఉన్నాయి. అని నిశ్చింతగా భూయజమానులున్నారు. దీన్ని ఆసరాగా తీసుకున్న కొంతమంది భూకబ్జాదారులు దొంగ కాగితాలు సృష్టించారు. యజమానులు వస్తే తప్పుడు కాగితాలు చూపించి అడ్డుకోవడం ఆనవాయితీగా మారింది. దీంతో పలు కాలనీల్లో అనేక ప్లాట్లు వివాదాస్పదంగా మారాయి. కోర్టులో కేసులు నడుస్తున్నాయి.

దోమలకు ఆవాసం..

ఖాళీ ప్లాట్లలో వర్షపు, మురుగు నీరు నిలుస్తోంది. పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. పురుగులు, దోమలు చేరి స్థానికుల కంటిమీద కునుకు లేకుండా పోతోంది. ఖాళీ స్థలాల యజమానులను మున్సిపల్ అధికారులు గుర్తించి నోటీసులు జారీ చేయకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గతంలో కొంత మందికి నోటీసులు పంపించిన అధికారులు ఆతర్వాతి ఒత్తిళ్లకు మిన్నకుండిపోయారు. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని పలు కాలనీల్లో 2,500కు పైగా ఖాళీ స్థలాలున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఖాళీ ప్లాట్ల యజమానులకు నోటీసులు జారీ చేసి, జరిమానాలు విధించాలని పలువురు కోరుతున్నారు.



రాంనగర్‌లో ఖాళీ ప్లాట్లలో ఏపుగా పెరిగిన తుమ్మలు

ప్రజల ఇబ్బందులు తొలగించాలి



ఖాళీ స్థలాల్లో పెరిగిన గడ్డి, సర్కార్ తుమ్మల కారణంగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈస్థలాల్లో మురికి నీరు, వర్షపు నీరు నిలిచి కుంటలుగా కనిపిస్తున్నాయి. దోమల బెడద ఎక్కువైంది. అధికారులు నివారణ చర్యలు చేపట్టాలి.

- దొంగల కుమార్, బోడగుట్ట

నీరు నిలుస్తోంది..



ఖాళీ స్థలాల్లో సర్కార్ తుమ్మలతో పాటు గడ్డి విపరీతంగా పెరుగుతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి ఖాళీ ప్లాట్లలో పెరుగుతున్న సర్కార్ తుమ్మలను జేసీబీల సాయంతో పూర్తిగా తొలగించాలి. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలి.

- సందెల విజయ్‌కుమార్, భవానీనగర్

జరిమానా వేయాలి



ఖాళీ ప్లాట్లలో నీరు నిలుస్తోంది. స్థానికులకు దోమలు, ఈగలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయడంతో పాటు జరిమానాలు విధించాలి. అధికారులు పట్టించుకోవాలి. దోమల బెడద నుంచి కాపాడాలి.

- సుంచు వేణుకుమార్, సోమిడి

శరవేగంగా కాగజ్‌నగర్ మూడో రైల్వే లైన్

● పనులు చేపట్టడానికి కాజీపేట నుంచి తరలివెళ్లిన సిబ్బంది

కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని సిర్‌పూర్‌కాగజ్‌నగర్ మూడో రైల్వే లైన్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కాజీపేట–బల్లార్షా మూడో రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా సిర్‌పూర్‌కాగజ్‌నగర్–మకోడి మధ్య 30 కిలోమీటర్ల దూరం రైల్వే లైన్ పనులు చేపట్టడానికి కాజీపేట జంక్షన్ నుంచి ఇంజనీరింగ్, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, ఓహెచ్ఈ, ఆపరేటింగ్ కన్‌స్ట్రక్షన్ విభాగాలకు చెందిన అధికారులు, కార్మికులు తరలివెళ్లినట్లు ఆదివారం రైల్వే ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

రైల్వే రవాణాకు అంతరాయం

సిర్‌పూర్ కాగజ్‌నగర్ మూడో రైల్వే లైన్ నిర్మాణ పనుల నేపథ్యంలో కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా ప్రయాణించే 16 రైళ్ల సర్వీస్‌లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈనెల 26వ తేదీ వరకు రద్దు చేశారు. ఆరు రైళ్ల సర్వీస్‌లను ఈనెల 27వ తేదీ వరకు పార్శల్లీ రద్దు, రెండు రైళ్ల సర్వీస్‌లను ఈనెల 21 వరకు దారి మళ్లించి నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ఢిల్లీ నుంచి కాజీపేట, వరంగల్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



సిర్‌పూర్ కాగజ్‌నగర్‌లో నిర్మిస్తున్న మూడో లైన్

పంటలకు సస్య'రక్షణ'

● పండ్లతోటలు, తీగజాతి కూరలు, ఆకు కూరల్లో తప్పని సరి
● సెప్టెంబర్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యానశాఖ అధికారి సూచనలు

చెన్నారావుపేట : ప్రస్తుతం వ్యవసాయ సాగులో పెట్టుబడులు కొండంత.. లాభాలు గోరంత ఉన్నాయి. పైగా ప్రకృతి ప్రకోపానికి పంట చేతికి వస్తుందో? రాదో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో రైతులు సంప్రదాయ వ్యవసాయంపై అనాసక్తి కనబరుస్తున్నారు. దాదాపు వరి, పత్తి, ఇతర సంప్రదాయ పంటల సాగు విస్తీర్ణం తగ్గించుకుంటున్నారు. అధిక లాభాలు వచ్చే కూరగాయల పంటలు పండించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. పండ్ల తోటలు, కూరగాయల పంటల సాగుకే సై అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ పంటలు, ఉద్యాన తోటల్లో సెప్టెంబర్ నెలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై ఉద్యాన శాఖ అధికారి దయ్యాల రమేష్ 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

పండ్ల తోటలు

సెప్టెంబర్ నెలలో మామిడిలో కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంటుంది. పురుగు ఆశించిన పక్షంలో ఇనుప తీగకు చొప్పించి బయటకు లాగి చంపివేయాలి. రంధ్రాల్లో మిథైల్ పెరాథియాన్ 50 శాతం మందును 1 మిల్లీ లీటర్ నీటికి కలిపిన ద్రావణం లేదా పెట్రోల్ లేదా అల్యూమినియం ఫాస్ఫైడ్ బిళ్లలు వేసి బంక మట్టితో మూసివేయాలి.

అరటి..

అరటిలో తల్లి మొక్క చుట్టూ వచ్చే పిలకల కోతకు ఉపయోగించు కొడవలిని ప్రతిసారి ముందు డీజిల్/ కిరోసిన్‌లో ముంచి వైరస్ తెగుళ్ల వ్యాప్తిని నివారించాలి. వైరస్ తెగులు వ్యాప్తి చేసే పేనుబంక



బీరసాగు (ఫైల్)

నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ 2 మిల్లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. పచ్చ అరటి, కొవ్వూరు బొంత, కర్పూర చెక్కరకేళి రకాలను రెండో దఫాగా 110 గ్రాముల యూరియా, 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్



రమేష్
ఉద్యానశాఖ అధికారి

ఇచ్చి తేలికపాటి తడి ఇవ్వాలి. తేలిక నేలల్లో వేరు నులిపురుగుల నివారణకు మొక్కకు 25 గ్రాముల చొప్పున కార్బోఫ్యూరాన్ గుళికలు మొదలు దగ్గర 10 సెంమీ దూరంలో వేసి మట్టితో కప్పి తేలికపాటి తడి ఇవ్వాలి.

జామ..

జామాలో కాయలు పెరిగే దశలో నీటి తడులు ఇవ్వాలి. తొడిమ కుళ్లు తెగులు నివారణకు 1 శాతం బోర్డో మిశ్రమం లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటర్ నీటిలో కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

కూరగాయ పంటలు..

టమాట, వంగ, బెండ పంటల్లో సిఫార్సు చేసిన నత్రజని ఎరువులను పై పాటుగా వేసుకుని నీరు పెట్టాలి. ఈ పంటల్లో వైరస్ తెగుళ్ల వ్యాప్తిని అరికట్టేందుకు రసం పీల్చే పురుగులను నివారించాలి. రసం పీల్చే పురుగుల నివారణకు ఫాసలోన్, ఫిప్రోనిల్, డైమిథోయేట్ మందుల్లో ఏదైనా ఒక మందును లీటర్ నీటికి 2 మిలీ చొప్పున కలిపి పిచికారీ చేయాలి. తెల్లదోమ నివారణకు 1.5 గ్రాముల ఎసీఫెట్‌ను లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. కాయతొలుచు పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మిల్లీ లీటర్.. ఒక లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

తీగ జాతి కూరగాయలు..

తీగజాతి కూరగాయలను ఆశించే బూడిద తెగులు నివారణకు కెరాథేన్ 1 మిల్లీలీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. పండు ఈగ నివారణకు 2 మిల్లీ లీటర్ మలాథియాన్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా మలాథియాన్ 100 మిల్లీ లీటర్ 100 గ్రాములు చెక్కర లేదా బెల్లం 10 లీటర్ నీరు కలిపి విషపు ఎర తయారు చేసి మట్టి మూకుడులో లేదా ప్లాస్టిక్ పళ్లాలలో పోసి ఎకరాకు 10-12 మూకుడులను అక్కడక్కడ పెట్టాలి.

మునగ..

ఆగస్టులో విత్తిన ఏకవార్షిక మునగ రకాలను పాలిథిన్ సంచులతో నుంచి తీసి పొలంలో నాటుకోవాలి. విత్తనాలు మొలకెత్తే వరకు ప్రతి 3 రోజులకు నీటి తడి ఇవ్వాలి. తర్వాత 10-15 రోజులకు ఒకసారి నీటి తడి ఇవ్వాలి.

పసుపు..

పసుపు పంట పెరుగుదల, నేలలో తేమ సంరక్షణ కోసం కలుపుతీత అంతరకృషి చేయాలి. అవసరం మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నాటిన 80 రోజులకు ఎకరానికి 50 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 100 కిలోల వేపపిండితో కలిపి వేయాలి. దుంప ఈగ ఆశిస్తే ఎకరాకు 200 కిలోల వేపపిండితో 10 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు కలిపి మొక్క దగ్గర వేసి నీరు పెట్టాలి.

క్లుప్తంగా

ప్రేమ విఫలమైందని యువకుడి ఆత్మహత్య



వినోద్ (ఫైల్)

ఇల్లెందురూరల్: ప్రేమ విఫలమైందనే ఆవేదనతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు మండలం పోలారం గ్రామానికి చెందిన వినోద్ (25) మానుకోట జిల్లా కలెక్టరేట్‌లోని దివ్యాంగుల విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. పోలారం గ్రామానికే చెందిన ఓ యువతితో ఆయన ప్రేమలోపడగా, యువతి తండ్రి వినోద్‌ను హెచ్చరించాడు. దీంతో మనస్తాపానికి గురైన వినోద్ ఇరవై రోజుల క్రితం పురుగుల మందు తాగగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వినోద్ తండ్రి ప్రభాకర్ ఫిర్యాదుతో యువతి కుటుంబానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఇల్లెందు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

టేకుమట్ల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని ఆశిరెడ్డిపల్లి శివారు చలివాగులో శనివారం చేపల వేటకు వెళ్లిన పంగిడిపల్లి గ్రామానికి చెందిన పురాణం భవాని(39) గల్లంతైన విషయం విదితమే. ఈ క్రమంలో ఆదివారం ఉదయం నుంచి జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, పోలీస్, అగ్నిమాపక టీమ్ ఆధ్వర్యంలో చేపట్టిన గాలింపు చర్యల్లో భవాని మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. దీంతో మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిట్యాల ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

బావురుగొండకు చేరిన గుర్తుతెలియని మహిళ

● పోలీసులకు అప్పగించిన స్థానికులు



గంగారం : ఓ గుర్తు తెలియని మహిళ ఆదివారం మండలంలోని బావురుగొండకు చేరగా గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బొడిగ రాంచంద్రు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకుని ఆమెను విచారించారు. ఆ మహిళ పేరు బుధవాడ భుదిరి. భర్త పోజల్. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అల్లపల్లి దగ్గర గూడెంగా పేర్కొన్నారు. దీంతో అల్లపల్లి, గుండాల పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇచ్చిన పోలీసులు.. ఆ మహిళను మహబూబాబాద్ జిల్లాలోని సఖి కేంద్రానికి తరలించారు. ఆ మహిళ వివరాలు తెలిస్తే గంగారం పీఎస్‌లో సంప్రదించాలన్నారు. హెచ్‌సీ లక్ష్మీనర్సు, రాజశేఖర్, సౌభాగ్య పాల్గొన్నారు.

'చాంబర్' ఉత్సవాల్లో సాంస్కృతిక పోటీలు

● 20లోగా దరఖాస్తులకు ఆహ్వానం
● 24, 25 తేదీల్లో పోటీల నిర్వహణ
● అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి వెల్లడి



బొమ్మినేని రవీందర్‌రెడ్డి

వరంగల్ : వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 75 సంవత్సరాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకొని 15 ఏళ్ల లోపు విద్యార్థినీ, విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నామని ఛాంబర్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ఛాంబర్ కార్యాలయంలో మాట్లాడుతూ 10 ఏళ్ల లోపు వారిని సబ్-జూనియర్స్‌గా, 15 ఏళ్ల లోపు వారిని జూనియర్స్‌గా గుర్తించడం జరుగుతుందన్నారు. పోటీల విభాగంలో శాస్త్రీయ, సంగీత, భక్తి/దేశభక్తి/సినీగీతాలతో పాటు జానపద గేయాలు ఉంటాయన్నారు. నృత్య విభాగంలో కూచిపూడి, భరతనాట్యం, శాస్త్రీయ నృత్యాల్లో, దేశభక్తి/సినీ, జానపద విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. అదే విధంగా సోలో, గ్రూపు విభాగాల్లో కూడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, స్పెషల్ బహుమతులు ఇవ్వబడుతాయన్నారు. పాటలు, నృత్య విభాగం పోటీల్లో పాల్గొనే వారు ఈనెల 20లోగా వరంగల్ ఛాంబర్ కార్యాలయములో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పోటీలు 24, 25వ తేదీల్లో వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించబడతాయన్నారు. వివరాల కోసం సెల్ నెంబర్ 98661 60555లో సంప్రదించాలని ఆయన కోరారు.

కుర్చపల్లిలో అతిపెద్ద గానుగరాయి

● చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి



గానుగరాయిని చూపుతున్న రెడ్డి రత్నాకర్‌రెడ్డి

రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కుర్చపల్లిలో అతి పెద్ద గానుగరాయిని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి ఆదివారం వెలుగులోకి తెచ్చారు. గ్రామ శివారులోని మద్దెర్ల కృపాకర్ రెడ్డి ఫాంహౌస్‌లో గుర్తించిన గానుగరాయి వివరాలను ఆయన వెల్లడించారు. నాడు డంగు సున్నం తయారీ కోసం వినియోగించే ఈ గానుగరాయి ఫీటు మూడు ఇంచుల వ్యాసార్థం, ఏడు ఇంచుల మందం.. 9 ఫీట్ల 8 ఇంచుల చుట్టు కొలత కలిగి ఉందని చెప్పారు. భవిష్యత్ తరాల కోసం చరిత్రలో ఉండాలని మద్దెర్ల ఫామ్‌హౌస్ మధ్యలో ప్రవేశ ద్వారానికి ఎదురుగా గానుగరాయిని నిలబెట్టుకోవడం అభినందనీయమన్నారు. పురావస్తు శాఖ అధికారులు చరిత్ర ఆధారాలు వెలికి తీసి కాపాడాలని ఆయన కోరారు.

మూసివేసిన హాస్టళ్లను తెరిపించాలి



పరిపాలనా భవనం వద్ద ధర్నా నిర్వహిస్తున్న పీజీ, స్కాలర్స్, వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు

● కేయూలో పీజీ విద్యార్థులు, స్కాలర్స్ ధర్నా

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో మూసివేసిన హాస్టళ్లను, మెస్‌లను తెరిపించాలని డిమాండ్ చేస్తూ కొందరు పీజీ విద్యార్థులు, పరిశోధకులు, వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు ఆదివారం పరిపాలనా భవనం వద్ద ధర్నా చేశారు. గత కొంతకాలంగా యూనివర్సిటీలో వీసీ, రిజిస్ట్రార్లు చేసిన తప్పులకు హాస్టల్స్‌ను మూసివేసి పీహెచ్‌డీ విద్యార్థులను కూడా చదువులకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగ విరమణ పొందిన మీరు వీసీ, రిజిస్ట్రార్లుగా కొనసాగవచ్చు కానీ మాకు అడ్మిషన్లు ఉన్నప్పటికీ నాన్‌బోర్డర్లుగా చిత్రీకరించి వెకేట్ చేయించటం శోచనీయమన్నారు. అధికారులు కుట్రపూరితంగానే హాస్టళ్లను మూసివేశారనిఆరోపిస్తూ ప్లకార్డులు చేతబూని ధర్నా చేశారు. స్కాలర్ హాస్టల్ రూమ్‌లకు వేసిన తాళాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రాంత ప్రొఫెసర్ కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావును తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. కనీస అర్హతలు లేని జాయింట్ డైరెక్టర్లను, అడిషనల్ డైరెక్టర్‌ను ఆ పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ (కుర్సా) అధ్యక్షుడు తాళ్లపెల్లి నరేష్‌గౌడ్, ఎంఎస్‌ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ మంద భాస్కర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు, ఎంఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ వడ్డేపెల్లి మధు, పరిశోధక విద్యార్థులు మాదాసి రమేష్, గుండేటి సుమన్, సోమరాజు, విష్ణు, సురేష్, సాంబయ్య, సంపత్, జానకిరామ్, ఆశీర్వాదం, విజయ్, సతీష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వివేక్‌నగర్‌కాలనీలో చోరీ..

● ఐదు తులాల బంగారం, నాలుగు కిలోల వెండి అపహరణ

హసన్‌పర్తి: కేయూ పీఎస్ పరిధిలోని వివేక్ నగర్ కాలనీలో చోరీ జరిగింది. ఈ మేరకు ఆదివారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం కాలనీకి చెందిన సరళ ఈనెల 3న తేదీన ఇంటికి తాళం వేసి నగరంలోని తన సమీపంలో బంధువుల ఇంటికి వెళ్లింది. వారం తర్వాత ఇంటికి వచ్చే సరికి తలుపు ధ్వంసం చేసి కనిపించింది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారం, నాలుగు కిలోల వెండి, రూ.30వేలు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్లూస్‌టీమ్‌తో ఆధారాలు సేకరించారు. అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

టీచర్ల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న భోగేశ్వర్

విద్యారణ్యపురి: టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారిభోగేశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సంఘం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీల్లో తలెత్తిన సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతోనూ చర్చించాలని, లీన్‌లో ఉన్న పోస్టులకు కౌన్సెలింగ్ కంటే ముందే అలాట్ చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లోనూ సర్వీస్ పర్సన్స్‌ను నియమించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ పూజారి మనోజ్, ఉపాధ్యాయ దర్శిని సంపాదకుడు వి.అజయ్‌బాబు, బాధ్యులు స్వామి, జె.స్వామి, లక్ష్మీపతి, అశోక్, దినేష్, సౌకత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యావిధానానికి ఉద్యమించాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ

తొర్రూరు: సమాజంలో అసమానతలు లేని శాస్త్రీయ విద్యా విధానం కోసం విద్యార్థి లోకం ఉద్యమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ పిలుపునిచ్చారు. డివిజన్ కేంద్రంలో పీడీఎస్‌యూ నిర్మాణ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ నేటి విద్యావిధానం అసమానతలను పెంపొందించేలా ఉందన్నారు. విద్య ప్రైవేటీకరణ, కాషాయీకరణకు బీజేపీ ప్రభుత్వం అడుగులు వేస్తోందని, దాన్ని విద్యార్థి లోకం అడ్డుకోవాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాల్సిన అవసరం ఉందని, పిల్లల భుజాలపై పుస్తకాల బరువును తగ్గించాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు యుగంధర్, ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు అనిల్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి భూక్య సంతోష్, కోశాధికారి జావీద్ పాల్గొన్నారు.

బీసీలు మేల్కొనాలి

● ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్



వాహనాల శ్రేణిని ప్రారంభిస్తున్న వేణుగోపాల్

హన్మకొండ: బీసీలు ఇకనైనా మేల్కొనాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన బీసీ సింహగర్జనకు హనుమకొండ నుంచి భారీగా బీసీలు తరలివెళ్లారు. నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్ వద్ద వాహన శ్రేణిని వేణుగోపాల్ ప్రారంభించి మాట్లాడారు. జనాభాలో అత్యధిక భాగంగా ఉన్న బీసీల విషయంలో అన్ని రాజకీయ పార్టీలు అవలంబిస్తున్న వివక్షను విడనాడాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రకటించిన ఎమ్మెల్యే సీట్లను గమనిస్తే కేవలం 10 శాతం ఉన్న అగ్రవర్ణాలకు 50 శాతం, 55 శాతం ఉన్న బీసీలకు కేవలం 20 శాతం సీట్లు కేటాయించి తీరని అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీ ఇలాగే వ్యవహరిస్తే రాబోయే ఎన్నికల్లో అన్ని జనరల్ స్థానాల్లో బీసీ నాయకులను పోటీలో దింపి అన్ని ప్రధాన రాజకీయ పార్టీలను ఓడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు డాక్టర్ గుండాల మదన్ కుమార్, దాడి మల్లయ్య యాదవ్, అల్లం నాగరాజు, బచ్చు ఆనందం, ఎర్రోజు బిక్షపతి, తాళ్ల సంపత్, చిర్ర రాజు, బొమ్మ నాగరాజు, కాసగాని అశోక్ గౌడ్, తమ్మెల శోభరాణి, సులోచన, మాడిశెట్టి నాగరాజు పటేల్, తవుటం రవీందర్, సమ్మయ్యగౌడ్, పంజాల మధు గౌడ్, గొట్టే మహేందర్, అనిల్, రాజు పాల్గొన్నారు.

పండుగకు వస్తూ పైలోకానికి..

● రోడ్డ ప్రమాదంలో యువకుడి దుర్మరణం
● మహిళకు తీవ్ర గాయాలు ● సంగెంలో ఘటన



రవీందర్(ఫైల్)

సంగెం: బోనాల పండుగకు వస్తుండగా స్కూటీ అదుపు తప్పి కిందపడడంతో ఓ యువకుడు మృతి చెందగా ఓ మహిళ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతోంది. పోలీసుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన పులి రవీందర్(30) హనుమకొండ కోర్టులో జ్యుడీషియల్ క్లర్క్‌గా విధులు నిర్వర్తిస్తూ తన చిన్నమ్మ చిర్ర పద్మ ఇంట్లో ఉంటున్నాడు. స్వగ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాల పండగ ఉండడంతో తన స్కూటీపై చిన్నమ్మ పద్మను తీసుకుని వస్తున్నాడు. ఈ క్రమంలో చింతలపల్లి రైల్వేగేట్ వద్దకు రాగానే స్కూటీ అదుపు తప్పడంతో ఇద్దరు కిందపడ్డారు. దీంతో తీవ్రగాయాలలైన క్షతగాత్రులను వెంటనే 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా రవీందర్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పద్మ చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై మృతుడి సోదరుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.భరత్ తెలిపారు.

రవీందర్‌కు జిల్లా జడ్జి కృష్ణమూర్తి నివాళి..

హనుమకొండ జిల్లా కోర్టులో క్లర్క్‌గా విధులు నిర్వర్తిస్తున్న పులి రవీందర్ ఆదివారం సంగెం మండల కేంద్రంలోని చింతలపల్లి రైల్వే గేట్ వద్ద స్కూటీపై నుంచి పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న హనుమకొండ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి కృష్ణమూర్తి సతీసమేతంగా వరంగల్ ఎంజీఎం మార్చురీలో రవీందర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో వరంగల్, హనుమకొండ జ్యుడీషియల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు బుజ్జి బాబు, మల్లికార్జున్, కోర్టు సిబ్బంది, సర్పంచ్‌ల ఫోరం సంగెం మండల అధ్యక్షుడు డేటి బాబు తదితరులు ఉన్నారు.

విద్యార్థులను వేధించడం అమానుషం



మాట్లాడుతున్న వెంకటనారాయణ

హన్మకొండ: కాకతీయ యూనివర్శిటీలో పీహెచ్‌డీ ప్రవేశాల్లో అవకతవకలు జరిగాయని ఆందోళన చేస్తున్న పరిశోధన విద్యార్థులను టాస్క్‌ఫోర్స్ పోలీసుల ద్వారా వేధింపులకు గురిచేయడం, అక్రమ కేసులు పెట్టడం అమానుషమని రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని స్వగృహంలో ఆయా పార్టీలు, సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేయూలో హాస్టళ్లను మూసివేసి విద్యార్థులను పంపించివేయడాన్ని మేధావులు తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగి క్యాంపస్‌ను పోలీసులకు అప్పగించడం దురదుష్టకరమన్నారు. విద్యార్థి సంఘాలు ఈ నెల 12న ఉమ్మడి జిల్లా బంద్‌కు పిలుపునిచ్చాయని, బంద్‌కు తాము సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో విద్యాసంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు బంద్‌కు సహకరించాలన్నారు. బీజేపీ నాయకుడు అమరేందర్‌రెడ్డి, బీఎస్పీ రీజియన్ కార్యదర్శి సునీల్, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, వైఎస్సార్ టీపీ నాయకుడు కొటిల్ రెడ్డి, టీడీపీ నేత శ్యాంసుందర్ పాల్గొన్నారు.

వామపక్ష నేత కన్నుమూత

● గుండెపోటుతో పరికరాల భూమయ్య మృతి



భూమయ్య(ఫైల్)

శాయంపేట : కామ్రేడ్ ఓంకార్ బాటలో పయనిస్తూ పేదలకు అండగా నిలబడి పెత్తందార్లకు వ్యతిరేకంగా పనిచేసిన ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ పరికరాల భూమయ్య ఆదివారం గుండెపోటుకు గురై నాగ్‌పూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని నేరేడుపల్లికి చెందిన పరికరాల లింగమ్మ-సమ్మయ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు భూమయ్య చిన్నతనం నుంచి కష్టాల కడలిలో కొనసాగుతూనే కామ్రేడ్ ఓంకార్ బాటలో ప్రయాణం సాగించాడు. 40 ఏళ్ల పాటు ఎంసీపీఐ(యు) పార్టీలో సుదీర్ఘంగా పని చేశారు. ప్రస్తుతం పార్టీలో తెలంగాణ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పని చేస్తున్నాడు. భూమయ్యకు భార్య కనకలక్ష్మి, కుమారుడు ప్రదీప్, కుమార్తె శ్వేత ఉన్నారు. ఆయన మృతితో నేరేడుపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు

ఎంసీపీఐ(యు) పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ పరికరాల భూమయ్య గుండెపోటుతో ఆదివారం నాగపూర్‌లో మృతి చెందాడు. అతని భౌతికకాయాన్ని స్వగ్రామమైన నేరుడుపల్లెకు తీసుకువచ్చి సోమవారం అంతిమయాత్ర ప్రారంభించి దహన సంస్కారాలు నిర్వహిస్తామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర అధ్యక్షుడు కర్రు రాజిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి భూమయ్య అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించాలని కోరారు.

సంస్కృతిని రేపటి తరాలకు అందించాలి

● బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



సోమిడిలో పోచమ్మను దర్శించుకుంటున్న రావు పద్మ

హన్మకొండ: సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. ఆదివారం హనుమకొండ, కాజీపేటలోని పోచమ్మ దేవాలయాలను పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రావు పద్మ సందర్శించి అమ్మవార్లకు పూజలు చేశారు. ఈసందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారికి మొక్కుకున్నట్లు తెలిపారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని డప్పు చప్పుళ్ల మధ్య ముందుకు సాగుతూ ఊరంతా చల్లగా, పాడి పంటలు బాగుండాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిర్ర నర్సింగ్ గౌడ్, చాంద్ పాషా, గుంటి కుమారస్వామి, భగవాన్ ఉపాధ్యాయ, కంది యాదగిరి, కాయిత రాజ్‌కుమార్, సుధీర్‌కుమార్, వెంకన్న, సతీశ్, గొర్రె రాజు, ప్రశాంత్, శ్రీను, పవన్, రవి, శ్రావణ్, జీవన్ పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



వడ్డెర ప్రతినిధుల సభ పోస్టర్ విడుదల చేస్తున్న తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం నాయకులు

● సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వల్లపు సమ్మయ్య

హన్మకొండ: సంచార జీవితం గడిపే వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య డిమాండ్ చేశారు. ఈనెల 12న హైదరాబాద్‌లో జరిగే వడ్డెరల ప్రతినిధుల సభ పోస్టర్‌ను ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో వడ్డెరలకు న్యాయం జరుగలేదని, పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలోనూ అదే పరిస్థితి నెలకొందన్నారు. కేసీఆర్ మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్న సందర్భంగా వడ్డెరలను ఎస్టీలో కలుపుతామని చెప్పారని, తొమ్మిదేళ్లు గడిచినా ఆ ప్రస్తావన తీసుకురావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి దుర్గయ్య, సలహాదారుడు గుంజ సాంబరావు, నాయకులు బొంత ఐలయ్య, పల్లపు రవీందర్, బొంత మురళి, ధారంగుల రాజకుమార్, పల్లపు నవీన్, బొంత శివ, పల్లపు సాంబరాజు, పల్లపు రాజన్న, పల్లపు బాలరాజు, కంది యాదగిరి, శివరాత్రి కృష్ణ, పల్లపు సాంబరాజు పాల్గొన్నారు.